# కలం

ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu

సోమవారం
23-03-2026 పేజీలు: 4


360° SINGLE TOPIC

ఆయిల్ & గ్యాస్ ఎఫెక్ట్

"గ్యాస్ కొరత లేదు.. పెట్రోల్ రేట్లు పెంచట్లేదు..ఎవరూ భయపడాల్సిన పనిలేదు.." ఇవీ కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వం చెప్తున్న మాటలు! ఈ మాటలు జనానికి భరోసా ఇవ్వకపోగా, మరింత ప్యానిక్‌కు గురిచేస్తున్నాయి. కేంద్రం చెప్తున్న మాటలకు, గ్రౌండ్ రియాలిటీకి పొంతన లేదు. ఒకవైపు కమర్షియల్ సిలిండర్ల డెలివరీ ఇంకా గాడిన పడలేదు. మరోవైపు డొమెస్టిక్ సిలిండర్లూ టైమ్‌కు అందడంలేదు. దీనికి తోడు వాటి రేట్లను కేంద్రం పెంచింది. ఇంకో వైపు పవర్ పెట్రోల్, ఇండస్ట్రియల్ డీజిల్ ధరలను కూడా పెంచేసింది. ఢిల్లీ లాంటి ఏరియాల్లోనూ కట్టెల పొయ్యి వాడకంపై ఇంతకాలమున్న నిషేధాజ్ఞలను తొలగించింది. "పొగచూరుతున్న బతుకుల్లో వెలుగులు నింపేది గ్యాస్.." అంటూ ప్రమోట్ చేసిన పాలకులే ఇప్పుడు బ్యాక్ టు 'కట్టెల పొయ్యి' అంటున్నారు. ఈ చర్యలన్నీ.. ఏదో జరగబోతున్నదన్న ఆందోళనను రెట్టింపు చేస్తున్నాయి.

బుక్ చేసి వారం పది రోజులైనా సిలిండర్ అందట్లేదు. ఏజెన్సీల ముందు జనం ఖాళీ సిలిండర్లతో పడిగాపులు కాస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు పెరుగుతాయోనన్న టెన్షన్‌తో బంకుల ముందు క్యూ కడుతున్నారు. దీనికి తోడు చాయ్ మొదలు నిత్యావసర వస్తువుల రేట్లు భగ్గుమంటున్నాయి. చాలామంది ఉపాధి కోల్పోతున్నారు. సామాన్యుడి జీవితం భారంగా మారుతున్నది. పట్నం నుంచి పల్లె దాకా ఇప్పుడు అంతా 'బ్యాక్ టు కట్టెల పొయ్యి'. ఒకప్పుడు ఇంటి పెరట్లోని కట్టెలను ఎక్కడ పడేయాలో అర్థంకాక తలలుపట్టుకున్న జనమే.. ఇప్పుడు ఆ కట్టెల కోసం మండీల చుట్టూ తిరుగుతున్నారు. కట్టెల రేట్లు డబుల్ అయ్యాయి. కొన్ని చోట్ల వాటికీ షార్టేజే. సందట్లో సడేమియా తరహాలో.. విమాన టికెట్ల ధరల పెంపుపై ఇంతకాలం ఉన్న ఆంక్షలను కేంద్రం ఎత్తేయడంతో ఆ రేట్లూ పెరిగిపోనున్నాయి. క్షేత్రస్థాయి కష్టాలపై కలం 360 డిగ్రీస్ కథనం..

తెలంగాణ బ్యూరో, కలం

# కొరత లేదంటూనే..

# కోతలు వాతలు




## కేంద్రం యాక్షన్.. పబ్లిక్ పరేషాన్

పనిచేయని 'భరోసా' మాటలు.. గ్యాస్, పెట్రోల్ కోసం పడిగాపులు

పట్టణాలు, పల్లెల్లో బ్యాక్ టు కట్టెల పొయ్యి.. మండీల్లో కట్టెలకు ఫుల్ డిమాండ్

మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలు.. ఉపాధి కోల్పోతున్న వలసజీవులు


### పీఎన్‌జీ సప్లై కట్

ఎల్పీజీ కొరత కారణంగా పీఎన్‌జీకి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు డొమెస్టిక్ సప్లైకి ప్రాధాన్యం ఇస్తూ కమర్షియల్, ఇండస్ట్రియల్ వినియోగంపై ఆంక్షలు విధించాయి.

- ఢిల్లీలోని కమర్షియల్, ఇండస్ట్రియల్ కనెక్షన్లకు 20 శాతం సరఫరా కట్ చేస్తున్నట్టు ఈ నెల 12న ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) ప్రకటించింది.
- ముంబైలోని కమర్షియల్, ఇండస్ట్రియల్ కనెక్షన్లకు 20 శాతం సరఫరా కట్ చేస్తున్నట్టు ఈ నెల 11న మహానగర్ గ్యాస్ లిమిటెడ్ (ఎంజీఎల్) ప్రకటించింది.
- పుణెలోని కమర్షియల్, ఇండస్ట్రియల్ కనెక్షన్లకు 20 శాతం సరఫరా కట్ చేస్తున్నట్టు ఈ నెల 11న మహారాష్ట్ర నేచురల్ గ్యాస్ లిమిటెడ్ (ఎంఎన్‌జీఎల్) ప్రకటించింది.



## కేంద్రం ఎప్పుడేం చెప్పింది?



**2026 మార్చి 7:** ఎల్పీజీ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.60, కమర్షియల్ సిలిండర్‌పై రూ.115 పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో హైదరాబాద్‌లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.965కు, కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,105.50కు పెరిగింది.

**2026 మార్చి 8:** కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై ఆంక్షలు విధించింది. ఆస్పత్రులు, విద్యాసంస్థల లాంటి అత్యవసర రంగాలకే సప్లై చేయాలని ఆదేశించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య పరిశ్రమలకు సరఫరా దాదాపు పూర్తిగా ఆగిపోయింది. గ్యాస్ లేక బెంగళూరు, చెన్నై, ముంబై, కోల్‌కతా తదితర నగరాల్లోని హోటళ్లు మూతపడ్డాయి.

**2026 మార్చి 9:** మొదట పీఎన్‌జీ, సీఎన్‌జీ, ఎల్పీజీ కనెక్షన్లకు గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశాలు. ఆ తర్వాతే ఫర్టిలైజర్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, పవర్ ప్లాంట్లకు సప్లై చేయాలని ఆర్డర్స్.

**2026 మార్చి 12:** దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత లేదని లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రకటన. ఎల్పీజీ సిలిండర్ల డెలివరీకి ఎప్పటిలాగే రెండున్నర రోజులే పడుతున్నదని వెల్లడి. అసలు కొరతే లేదని, ప్యానిక్ బుకింగ్‌తోనే సమస్య వచ్చిందని కామెంట్.

**2026 మార్చి 14:** అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కమర్షియల్ సిలిండర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటన. ఎల్పీజీ, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) రెండూ ఉంటే.. ఎల్పీజీ కనెక్షన్ వదులుకోవాల్సిందేనని కేంద్రం ఆదేశం. పీఎన్‌జీ మాత్రమే వాడుకోవాలని ఆంక్షలు. ఢిల్లీలో కట్టెల పొయ్యిలకు అనుమతి. గతంలో ఉన్న నిషేధం తాత్కాలికంగా ఎత్తివేత.

**2026 మార్చి 18:** ఎల్పీజీ భారాన్ని తగ్గించి పీఎన్‌జీని ప్రోత్సహించే రాష్ట్రాలకు అదనంగా 10% కమర్షియల్ ఎల్పీజీని సరఫరా చేస్తామని ప్రకటన.

**2026 మార్చి 20:** పవర్ పెట్రోల్ రేట్లు పెంపు. లీటర్‌పై రూ.2.35 వరకు పెంచుతున్నట్టు ప్రకటన. పారిశ్రామిక వినియోగదారులకు విక్రయించే బల్క్ డీజిల్ రేట్లు లీటర్‌కు రూ.22 పెంపు.

**2026 మార్చి 21:** రాష్ట్రాలకు అదనంగా మరో 20% కమర్షియల్ ఎల్పీజీ సప్లై చేస్తామని ప్రకటన.

## జనంలో టెన్షన్ ఎందుకు?



గ్యాస్ కొరత లేదంటూనే కేంద్ర ప్రభుత్వం రోజుకో ప్రకటన చేస్తుండడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఎల్పీజీ సరఫరాలో ఆంక్షలు విధించడంతో టెన్షన్ పడుతున్నారు. ఇది ఇంకెంత దూరం దారితీస్తుందోనన్న అయోమయంలో ఉన్నారు.

- ఎల్పీజీకి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు మరోలా ఉన్నాయి. బుకింగ్ చేసుకుని వారం రోజులైనా సిలిండర్లు డెలివరీ కావడం లేదు. చాలా సిటీల్లో గ్యాస్ ఏజెన్సీల వద్ద పెద్ద పెద్ద లైన్లు కన్పిస్తున్నాయి.
- రానున్న రోజుల్లో కొరత మరింత తీవ్రమవుతుందేమోనన్న భయాందోళనతో కొంతమంది సిలిండర్లను ముందస్తు బుకింగ్ చేసుకుంటున్నారు. ఈ ప్యానిక్ బుకింగ్‌తోనూ తీవ్రమైన కొరత ఏర్పడుతున్నది.
- కేంద్రం ఇప్పటికే ఎల్పీజీ రేట్లను పెంచింది. పవర్ పెట్రోల్, బల్క్ డీజిల్ ధరలనూ హైక్ చేసింది. ఈ నేపథ్యంలో ఏదో ఒక రోజు సాధారణ పెట్రోల్, డీజిల్ రేట్లను కూడా పెంచుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో..

## టైల్స్ ఇండస్ట్రీపైనా ఎఫెక్ట్



గ్యాస్ కొరత టైల్స్ ఇండస్ట్రీపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నది. టైల్స్ తయారీలో పీఎన్‌జీ, ప్రొపేన్, ఎల్పీజీని ఎక్కువగా వినియోగిస్తారు. ఇప్పుడు వీటికి కొరత ఏర్పడడంతో టైల్స్ తయారీపై ఎఫెక్ట్ పడుతున్నది.


- భారత్‌లో టైల్స్ తయారీకి గుజరాత్‌లోని మోర్బీ పట్టణం ఫేమస్.

**మోర్బీలో 600 పరిశ్రమలు ఉండగా, 4 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు.**

## ఆగిన మత్స్యకారుల బోట్లు

**డీజిల్ కొరత, ధరల పెంపు ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలోని మత్స్యకారుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నది. మెకనైజ్డ్ బోట్లను నడపాలంటే భారంగా ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేటకయ్యే ఖర్చు పెరగడంతో చాలామంది బోట్లను ఒడ్డుకే పరిమితం చేస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌కు చేపల రాక తగ్గి, వాటి ధరలు పెరుగుతున్నాయి.**





### టెక్స్‌టైల్ ఇండస్ట్రీకి దెబ్బ

## వలసజీవి వెనక్కి..

క్రూడాయిల్, గ్యాస్ కొరత కారణంగా టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తీవ్రంగా దెబ్బతింటున్నది. క్రూడాయిల్ ధరలు పెరిగి ముడి పదార్థాల రేట్లు పెరగడం.. బొగ్గు, ఎల్పీజీ కొరతతో ఫ్యాక్టరీలు మూతపడడం.. తినడానికి తిండి లేక, చేయడానికి పని లేక మైగ్రేంట్ వర్కర్లు సొంతూళ్ల బాటపట్టారు.

- గుజరాత్‌లోని సూరత్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీకి హబ్. ఇక్కడి మిల్లుల్లో లక్షలాది మంది పని చేస్తున్నారు. తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు.
- వస్త్ర పరిశ్రమల్లో వివిధ రకాల పనులకు బొగ్గు, ఎల్పీజీని ఎక్కువగా వినియోగిస్తారు. ఇప్పుడు ఎల్పీజీ కొరతకు తోడు బొగ్గు రవాణా ఖర్చులు పెరిగి ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి.
- డొమెస్టిక్ సిలిండర్ల షార్టేజ్ కారణంగా మైగ్రేంట్ వర్కర్లు వంట చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. తెలంగాణ వాసులు కూడా తిరిగొస్తున్నారు.
- ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మిల్లులను వారానికి రెండు రోజులు బంద్ చేయాలని అసోసియేషన్ నేతలు నిర్ణయించారు.

**సూరత్‌లో ఉన్న దాదాపు 400కు పైగా మిల్లుల్లో 2.5 లక్షల మంది పని చేస్తున్నారు.**

మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధం.. సప్లై చైన్‌ను దెబ్బతీసింది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా, దిగుమతి చేసుకునే వస్తువుల కొరత ఏర్పడింది. ఈ యుద్ధ ప్రభావం మన వంటిల్లు, సామాన్యుడి నెలవారీ బడ్జెట్ పై తీవ్ర ప్రభావం పడుతున్నది. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ అవసరాల్లో ఎక్కువ భాగాన్ని దిగుమతి చేసుకోవాల్సిందే. యుద్ధం వల్ల సరఫరా తగ్గడంతో లీటరుపై రూ.15 నుంచి 30 వరకు పెరిగింది. ఇంపోర్ట్ చేసుకునే కందిపప్పు, మినుములు వంటి పప్పుల ధరలు కిలోకు రూ.20 నుంచి 30 మేర పెరిగాయి. అంతర్జాతీయంగా గోధుమల సరఫరాలో అడ్డంకులు ఏర్పడటంతో స్థానిక మార్కెట్లో గోధుమ పిండి ధరలు కూడా పెరిగాయి. మందుల తయారీకి వాడే ముడి పదార్థాలు, వ్యవసాయానికి ఉపయోగించే ఎరువుల దిగుమతి చార్జీలు పెరగడంతో వీటి ధరలు పైకి ఎగబాకాయి.




# ఏం కొనేటట్టు లేదు..!

## చాయ్ నుంచి చేపల దాకా ధరల దడ

సంపాదన పాతదే.. ఖర్చు మాత్రం కొత్తది.. అనే చందంగా సామాన్యుడి పరిస్థితి తయారైంది. కూరగాయలు, నూనె ధరలు పెరగడంతో సామాన్యుడి కంచంలో వెరైటీలు తగ్గుతున్నాయి. పప్పు, చారు లేదా కేవలం ఒక కూరతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. ఆదాయం పెరగకుండా ఖర్చులు ఎక్కువ కావడంతో నెలాఖరుకు ఇల్లు గడవక చిన్న చిన్న అప్పులు చేయక తప్పడం లేదు. ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, స్కూల్ ఫీజులతో పాటు ఈ ధరల భారం తోడవ్వడంతో సామాన్యులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.




- జీలకర్ర, వెల్లుల్లి, అల్లం వంటి మసాలా దినుసుల ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. పప్పు దినుసుల రేట్లు సగటున 30% పెరిగాయి.
- ఇప్పటికే ఎండాకాలం కావడంతో కోళ్లు ఎక్కువగా బతకవన్న కారణంతోచికెన్ ధరలు భారీగా పెరిగాయి.ఆదివారం కిలో చికెన్ రూ.355 పలికింది. మటన్ రేటు కిలో రూ.1,200కు ఎగబాకింది. చేపల రేట్లు కూడా పెరిగాయి. డీజిల్ కొరత కారణంగా మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లను వాడలేకపోతున్నారు. దీంతో చేపల వేట తగ్గిపోయింది. ఫలితంగా వాటి ధరలు పెరిగాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ. 150 రవ్వ చేప ఆదివారం రూ. 250 వరకు పలికింది. కొరమీను రేట్లు రూ. 200కు పైగానే పెరిగాయి. ఆదివారం మార్కెట్‌లో రూ. 700కు కిలో పలికాయి.
- సోపులు, డిటర్జెంట్లు, టూత్ పేస్ట్ వంటి వస్తువుల ధరలు కూడా 20% పైనే పెరిగాయి. వీటి తయారీకి వాడే ముడి పదార్థాల రవాణాకు ఇండస్ట్రియల్ డీజిల్ వాడటమే దీనికి ప్రధాన కారణం.
- అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు పెరగడంతో కేంద్రం కమర్షియల్ సిలిండర్ల సప్లై ఆపేసింది. దీంతో హోటల్ యజమానులు బ్లాక్‌లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు కొని ఉపయోగిస్తున్నారు. కొంత మంది బ్లాక్‌లో కమర్షియల్ గ్యాస్ కొని వాడుతున్నారు. దీంతో పది రూపాయలు ఉన్న చాయ్ 12 రూపాయలకు, 30 రూపాయలు ఉన్న టిఫిన్ 50 రూపాయలకు పెరిగింది.



### 25% పెరిగిన నెలవారీ ఖర్చులు


ఒక సగటు మధ్యతరగతి కుటుంబం నెలవారీ కిరాణా కోసం చేసే ఖర్చు గతంతో పోలిస్తే ఇప్పుడు 25-30% అదనంగా పెరిగింది. అంటే నెలకు రూ.8 వేలు ఖర్చయ్యే చోట ఇప్పుడు రూ.11 వేల వరకు వెచ్చించాల్సి వస్తున్నది. పెరిగిన ధరల వల్ల మధ్యతరగతి ప్రజలు తమ సేవింగ్స్ మొత్తాన్ని తీసి ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఇది భవిష్యత్తు అవసరాలకు (పిల్లల చదువు, పెళ్లిళ్లు) ఆటంకంగా మారనుంది.



### పెరిగిన నీళ్ల బాటిల్ రేట్!

వాటర్ బాటిల్స్, వాటి మూతల తయారీలో పెట్రో కెమికల్స్ వాడుతారు. బాటిళ్లను పాలిథిలిన్ టెరాప్తాలేట్‌తో, వాటి మూతలను హై డెన్సిటీ పాలిథిలిన్‌తో తయారు చేస్తారు. ఇవి ముడి చమురు నుంచి వచ్చే ఉప ఉత్పత్తులే. క్రూడాయిల్ ధరలు పెరగడంతో ప్లాస్టిక్ తయారీకి అయ్యే ఖర్చ్యూ పెరిగింది. నెల కింద కొన్ని చోట్ల లీటర్ వాటర్ బాటిల్ రూ.20 ఉంటే.. ఇప్పుడు రూ.25 నుంచి 28 వసూలు చేస్తున్నారు.

### ఫుడ్ డెలివరీ చార్జీలు హైక్




ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ స్విగ్గీ, జొమాటో చార్జీలు పెంచేశాయి. ప్రీమియం పెట్రోల్ ధరలు పెరగడం, కొన్నిచోట్ల పెట్రోల్ కొరత కారణంగా డెలివరీ బాయ్స్‌కు పెట్రోల్ అలవెన్స్ పెంచాల్సి వస్తున్నది. ఆ భారాన్ని కంపెనీలు కస్టమర్లపై డెలివరీ ఫీజు రూపంలో వేస్తున్నాయి. తమ నిర్వహణ ఖర్చుల కోసం ఆర్డర్‌పై అదనంగా రూ.5 నుంచి రూ.10 వరకు ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. హోటళ్లలోనే రేట్లు పెరగడంతో, యాప్స్‌లో కూడా ఫుడ్ ఐటమ్స్ ధరలు ఆటోమేటిక్‌గా పెరిగాయి.

### విమాన టికెట్ చార్జీలపై పరిమితి ఎత్తివేత

దేశీయ విమాన టికెట్ చార్జీలపై ఉన్న గరిష్ట, కనిష్ట పరిమితులను కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదివారం పూర్తిగా ఎత్తేసింది. కరోనా సమయంలో విమానయాన సంస్థలు.. ప్రయాణికుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేయకుండా ఉండేందుకు గతంలో ప్రభుత్వం ఒక పరిమితిని విధించింది. విమాన సంస్థలు ఒక స్థాయి కంటే తక్కువ ధరకు టికెట్లు అమ్మకూడదని, అత్యవసర సమయాల్లో ప్రయాణికుల నుంచి విపరీతమైన ధరలు వసూలు చేయొద్దనే నిబంధన ఉండేది. దాన్ని ఇప్పుడు పూర్తిగా ఎత్తేయడంతో.. ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇప్పుడు తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయించుకోవచ్చు.



### పెరిగిన ధరలు ఇలా..

| వస్తువులు | యుద్ధానికి ముందు (రూ.ల్లో) | ప్రస్తుతం (రూ.ల్లో) | పెరుగుదల (శాతాల్లో) |
|---|---|---|---|
| లీటర్ వంట నూనె | 115-120 | 145-150 | 35 |
| కిలో కందిపప్పు | 140-150 | 170-185 | 20 |
| మినపప్పు | 115-120 | 150-155 | 25 |
| పెసరపప్పు | 105-110 | 135-140 | 23 |
| శనగపప్పు | 70-75 | 95-100 | 27 |
| ఎండు మిర్చి కిలో | 240-250 | 340-360 | 40 |
| చింతపండు | 115-120 | 280-300 | 33 |
| పసుపు కిలో | 180-190 | 240-250 | 33 |
| గోధుమ పిండి (5 కేజి) | 200 | 250-270 | 25 |
| కిలో చక్కెర | 42 | 48-52 | 20 |

# కట్టెల రేట్లు డబుల్!

## మండీలు, సామిల్స్‌కు ఫుల్ గిరాకీ.. గ్యాస్ కొరతతో కట్టెలనే వాడుతున్న హోటళ్లు, జనం

## క్వింటాల్ రూ. వెయ్యికిపైనే

**గ్యాస్ కొరతతో పట్నం నుంచి పల్లె వరకు కట్టెల పొయ్యే దిక్కవుతున్నది. వంటింట్లో కట్టెల మంటకు పొగచూరుతున్న బతుకుల్లో వెలుగులు నింపేది గ్యాస్ పొయ్యి అంటూ ప్రమోట్ చేసిన పాలకులే.. ఇప్పుడు ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్ తో 'బ్యాక్ టు కట్టెల పొయ్యి' అంటున్నారు. మొన్నటి వరకు గిరాకీ లేక దిక్కులు చూసిన కట్టెల మండీ, సామిల్స్ వ్యాపారులు.. ప్రస్తుతం ఫుల్ వర్క్ లోడ్‌లో మునిగితేలుతున్నారు. కట్టెల కోసం రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. ఒకప్పుడు ఐదారు వందలకు క్వింటాల్ కట్టెలను అమ్మిన డిపోలే.. ఇప్పుడు పన్నెండు పదమూడు వందలకు అమ్ముతున్నాయి.**

**- కలం, నెట్‌వర్క్**



వరంగల్‌లో కట్టెల మండి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వంట గ్యాస్ కొరత కారణంగా హోటల్స్, టిఫిన్ సెంటర్లు, చిరు వ్యాపారులు ఎక్కువగా కట్టెలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. కట్టెల డిపోల్లో క్వింటాల్ కట్టెలు రూ. 800కుపైగా అమ్ముతున్నారు. ప్రస్తుతం ఒక్కో డిపో రోజుకు 50 క్వింటాల్ దాకా అమ్ముతున్నాయి. అంతకు ముందు రోజుకు 10 నుంచి 20 క్వింటాల్ అమ్మేవి.
- గ్యాస్ కొరతకు ముందు క్వింటా కట్టెలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.500 వరకు అమ్మేది. ప్రస్తుతం ఏడెనిమిది వందలు చేశామని డిపోల వ్యాపారులు చెప్తున్నారు. ఇంతకు ముందు ట్రాక్టర్ ఉన్నవాళ్లు కట్టెలను డైరెక్ట్ గా హోటళ్లలో వేసేది. ఇప్పుడు ట్రాక్టర్ల లోడ్ కు ఎక్కువ రేటు చెప్తున్నారని డిపోల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని హోటళ్లు వారానికి సరిపడా కట్టెలను ముందే కొని పెట్టుకుంటున్నాయి. గ్యాస్ కొరత ఇలానే కొనసాగితే ముమ్ముందు కట్టెలు దొరకడం కష్టంగానే ఉంటుందని డిపోల యజమానులు చెప్తున్నారు.
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గ్యాస్ కష్టాలు రాకముందు క్వింటాలు కట్టెల ధర రూ. వెయ్యి వరకు ఉండేది. వారం రోజులుగా అది రూ. 1,200 అయింది. మొన్నటి వరకు ఐదారు క్వింటాళ్ల కట్టెలను అమ్మిన డిపోలు.. ఇప్పుడు ఏకంగా టన్ను వరకు అమ్ముతున్నాయి.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు హోటల్స్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు కట్టెల పొయ్యిపై ఆధారపడుతున్నారు. కొద్ది రోజుల కింద క్వింటా కట్టెలు రూ. 600 వరకు అమ్మేది. ఇప్పుడు ఏడెనిమిది వందలకు దొరుకుతున్నాయి. మండిల్లో కట్టెలకు పెద్దగా కొరత లేదని యజమానులు చెప్తున్నారు. వ్యాపారం నిలకడగా ఉందని అంటున్నారు.
- గ్యాస్ కొరత రాకముందు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో క్వింటా కట్టెలు రూ.700 పలికేది. ఇప్పుడు రూ.1,000 వరకు అమ్ముతున్నారు. ప్రస్తుతం కట్టెలకు ఎలాంటి కొరత లేదని వ్యాపారులు చెప్తున్నారు. ఇంతకుముందు పెళ్లిళ్లు, కొన్ని హోటల్స్ వాళ్లు మాత్రమే కట్టెలు తీసుకెళ్లేవారు. కానీ, ఇప్పుడు రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు తీసుకెళ్తున్నారు.

### రోజుకు 50 క్వింటాళ్లు అమ్ముతున్నా

గ్యాస్ కొరత రాకముందు పండుగ సమయాల్లో , పెళ్లిళ్ల సీజన్ లో కట్టెల అమ్మకాలు ఎక్కువగా జరిగేవి. ప్రస్తుతం హోటల్స్, టిఫిన్ సెంటర్ల నుంచి కట్టెలకు ఎక్కువగా ఆర్డర్స్ వస్తున్నాయి. గతంలో రోజుకు 20 –30 క్వింటాళ్ల కట్టెలు అమ్మేది. ఇప్పుడు 50 క్వింటాళ్ల దాకా అమ్ముతున్నా.



**- హరి,**
**సామిల్ యజమాని, మంచిర్యాల**

### రైతులూ పెంచారు

గ్యాస్ కొరత రాక ముందు గ్రామాల్లో రైతుల వద్ద మేం క్వింటాల్ కట్టెలకు రూ.300 చెల్లించేది. ఇప్పుడు రైతులు కూడా రేటు పెంచారు. వారి వద్ద రూ.500కు కొనుగోలు చేస్తున్నాం. వాటిని మేం రూ. 700కు అమ్ముతున్నాం. రోజుకు 2 టన్నుల కట్టెలు సేల్ చేస్తున్నా.



**- శ్రీనివాసచారి,**
**శ్రీ వెంకటేశ్వర టింబర్ డిపో, ఖమ్మం**

### పాతరోజులను తలపిస్తున్నది

మా దగ్గర కొన్ని పెద్ద హోటల్స్ వాళ్లు ముందస్తుగా కట్టెలను కొనిపెట్టుకుంటున్నారు. గ్యాస్ కొరతతో కట్టెల పొయ్యి మీద వండుతున్నారు. గతంలో పెళ్లిళ్లు, ఫంక్షన్లకు మాత్రమే కట్టెలను తీసుకెళ్లేవారు. ఇప్పుడు సీన్ మారింది. పాతరోజులను తలపిస్తున్నది.



**- సైదులు,**
**టింబర్ డిపో, నల్లగొండ**

### డిమాండ్ పెరిగింది

పెళ్లిళ్ల సీజన్లో కట్టెలకు కొంతమేరకు డిమాండ్ ఉంటుంది. సాధారణ రోజుల్లో క్వింటా కట్టెలు రూ. 500 నుంచి 600 కు అమ్మేవాళ్లం. ప్రస్తుతం గ్యాస్ కొరత వల్ల హోటళ్లు ఎక్కువగా కట్టెలు కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పుడు క్వింటాకు రూ. 700 అమ్ముతున్నాం. రోజుకు 5 క్వింటాలు విక్రయిస్తున్నాం. కొద్దిరోజుల కిందటి వరకు రోజుకు 2 క్వింటాలు మాత్రమే అమ్మేది. ఇప్పుడు డిమాండ్ పెరిగింది.



**- జమీలా బేగం,**
**కట్టెల డిపో, జనగామ**



### నిల్వలు ఉన్నాయి

పెళ్లిళ్ల సీజన్ లో ఒక్కో డిపో 4 – 5 క్వింటాళ్ల వరకు కట్టెలు అమ్మేది. ఇప్పుడు టన్ను వరకు అమ్ముతున్నాం. కట్టెల నిల్వలు ఉన్నాయి.

**- గంగయ్య,**
**కట్టెల డిపో యజమాని, కంఠేశ్వర్, నిజామాబాద్**

మంచిర్యాలలో కట్టెల డిపో